క్లుప్తంగా

నేడు బతుకమ్మ చీరల పంపిణీ

కొడంగల్ : దసరా పండుగను పురస్కరించుకొని ప్రభుత్వం మహిళలకు బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమం గురువారం ప్రారంభించినట్లు ఎంపీడీఓ పాండు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ చేతుల మీదుగా బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తామన్నారు. అలాగే మండల పరిధిలోని తెలంగాణ క్రీడా ప్రాంగణాలకు ఆట వస్తువులు (స్పోర్ట్స్ కిట్లను) పంపిణీ చేస్తామన్నారు.

పంటల నమోదు



పంట నమోదు చేస్తున్న ఏఈఓ

దౌల్తాబాద్: మండలంలోని ఆయా గ్రామాల్లో ఏఈఓలు క్షేత్రస్థాయిలో పర్యటించి పంటల నమోదు చేస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం దౌల్తాబాద్ ఏఈఓ వైశాలి పంటల నమోదును చేశారు. రైతులు ఏఏ పంటలు సాగు చేస్తున్నారో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని తెలిపారు.

జాతీయ పోటీలకు కొడంగల్ యువకుడు



జాతీయ పోటీలకు ఎంపికైన కిరణ్

కొడంగల్ : జాతీయస్థాయి పరుగు పందెం పోటీల్లో పాల్గొనడానికి కొడంగల్‌కు చెందిన యువకుడు ఎంపికయ్యాడు. అక్టోబర్ 1వ తేదీన కరీంనగర్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో అండర్ -20 విభాగంలో పాల్గొని 1500 మీటర్ల పరుగు పందెంను 4 నిమిషాల 18 సెకండ్లలో పూర్తి చేసి బంగారు పతకం సాధించాడు. ఈ నెల 15, 16, 17 తేదీల్లో హన్మకొండలో జరిగే జాతీయ స్థాయి పరుగు పందెం పోటీలకు తెలంగాణ తరఫున ఎంపికయ్యాడు.

లెక్చరర్ పోస్టులు భర్తీ చేయాలని వినతి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్ పోస్టులు భర్తీ చేయాలని బుధవారం కొస్గి పట్టణానికి వచ్చిన మంత్రి హరీశ్‌రావుకు జెడ్పీటీసీ మహిపాల్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. మండలంలో జూనియర్ కళాశాల లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం కళాశాలను మంజూరు చేసింది. అయితే, లెక్చరర్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ విషయమై మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

వ్యర్థాలతో ఎరువుల తయారీ

కౌన్సిలర్ సంగీత



ఎరువు తయారీపై అవగాహన కల్పిస్తున్న సంగీత

తాండూరు టౌన్ : వ్యర్థ పదార్థాలతో ఎరువును తయారు చేయొచ్చని 20వ వార్డు కౌన్సిలర్ సంగీతాఠాకూర్ పేర్కొన్నారు. బుధవారం 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమంలో భాగంగా వార్డులోని మహిళలకు పరిసరాల పరిశుభ్రత, ఎరువుల తయారీపై అవగాహన కల్పించారు. ఇంట్లో నిండుకున్న చెత్తను తడి పొడిగా వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలన్నారు. ఇళ్లల్లో ఉన్న చెత్తతో ఎరువు తయారు చేసుకోవచ్చని సూచించారు. ఇంటి పరిసరాల కుండీల్లో పెరుగుతున్న మొక్కలకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. చెత్తా చెదారాన్ని ఆరుబయట పారేయొద్దని, దీనివల్ల దోమలు, ఈగల బెడద పెరిగి డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ప్రతి మహిళ చెత్తను ఎరువుగా మార్చుకోవాలని కోరారు.

సబ్‌స్టేషన్ ఏర్పాటయ్యేనా..?

ఆరు నెలల క్రితం మంజూరు
- నేటికీ ప్రారంభం కాని పనులు
- గోకఫసల్‌వాద్‌లో స్థలం గుర్తింపు



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి (ఫైల్)

దౌల్తాబాద్: మండలంలోని గోకఫసల్‌వాద్ గ్రామ రెవెన్యూ పరిధిలో మంజూరైన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి గ్రామ పంచాయతీ అనుమతి ఇచ్చింది. ప్రభుత్వం మంజూరు చేసిన సబ్‌స్టేషన్ పనులు ఇంకా ప్రారంభం కావడంలేదు. దీంతో లోఓల్టేజీ సమస్యతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని గోకఫసల్‌వాద్ గ్రామ రెవెన్యూ శివారులో 33/11కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను జూన్ నెలలో తెలంగాణ సంబరాల్లో భాగంగా ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభమైతే పోల్కంపల్లి, తిమ్మారెడ్డిపల్లి, గోకఫసల్‌వాద్, దేవర్‌ఫసల్‌వాద్, నాగసార్ తదితర గ్రామాలకు లోఓల్టేజీ సమస్య తీరుతుంది. గత ఎనిమిదేళ్ల క్రితం మండలంలోని పోల్కంపల్లి గ్రామ సమీపంలో సబ్‌స్టేషన్‌కు స్థలం లేక మంజూరు చేయలేదు.. మంజూరై ఆరు నెలలు గడుస్తున్నా నేటికీ పనులు ప్రారంభం కాలేదు.

రైతుల కరెంటు కష్టాలు

గోకఫసల్‌వాద్ ఫీడర్ కింద సుమారు 10 గ్రామాలు ఉన్నాయి. ప్రతిసారి కరెంటు ట్రిప్ కావడంతో ఆయా గ్రామాల రైతన్నల విన్నపం మేరకు స్థానిక ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి సబ్‌స్టేషన్ మంజూరు చేశారు. అప్పట్లో మంజూరు అయినా స్థలం లేక వెనక్కి వెళ్లడంతో ఇప్పుడు అయినా ప్రారంభిస్తారా లేదా అని పలువురు అంటున్నారు. సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన తరువాత ఎలాంటి పనులు చేయకపోవడంతో టెండర్లు అయ్యాయా లేదాని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా సబ్‌స్టేషన్ పనులు ప్రారంభించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

'కంటివెలుగు'కు అప్పులు చేశాం

- నిధులు విడుదల చేయడంలో జ్యాపం
- సర్వసభ్య సమావేశాలతో ఫలితం లేదు
- మండల ప్రజాప్రతినిధుల ఆవేదన
- వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం



అధికారులను ప్రశ్నిస్తున్న శంకర్ నాయక్

కుల్కచర్ల: అప్పులు చేసి వేల రూపాయలు ఖర్చు పెట్టి 'కంటివెలుగు'ను నిర్వహిస్తే కనీసం ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదని కుల్కచర్ల మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు శంకర్‌నాయక్, చాపలగూడెం సర్పంచ్ లక్ష్మణ్ వాపోయారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచులు, ఎంపీటీసీలు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. 'కంటివెలుగు'కు అప్పులు చేసి వేల రూపాయలు ఖర్చు చేస్తే ప్రభుత్వం నిధుల విడుదల చేయడంలో నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు లాల్ మాట్లాడుతూ.. ప్రజలచేత ఎన్నుకున్న తమకు సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికలో తమను సంప్రదించకపోవడం బాధాకరమన్నారు. సర్వసభ్య సమావేశాలతో ఎలాంటి ప్రయోజనం లేదని అసహనం వ్యక్తం చేశారు. ఎంపీటీసీ ఆనందం మాట్లాడుతూ.. కుల్కచర్ల ప్రధాన చౌరస్తాలో ధర్మశాల స్థలాన్ని పరిరక్షించడంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. అలాగే, మనఊరు- మనబడి పనులు సాఫీగా సాగడం లేదని సభ దృష్టికి తెచ్చారు. ఉపాధిహామీ నిధులు రావడం లేదని రాంనగర్ సర్పంచ్ రాజు సభకు తెలియజేశారు. సమస్యలపై ఫోన్లు చేసినప్పుడు అధికారులు స్పందించడం లేదని మండిపడ్డారు. అనంతరం ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్ నాయక్ మాట్లాడుతూ.. అధికారులు ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రతినిత్యం అందుబాటులో ఉంటూ వారికి భరోసా కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మండల రైతుబంధు కమిటీ అధ్యక్షుడు రాజు, తహసీల్దార్ మురళీధర్, ఎంపీడీఓ నాగవేణి, ఎంపీఓ కరీం, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

వికారాబాద్ అర్బన్: ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన ప్రతులను రాష్ట్ర ఎన్నికల అధికారికి పంపించామని అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో సంక్షేమ శాఖ అధికారి కోటాజీ , వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ ఆధ్వర్యంలో జరిగిన స్వీప్ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లాలో ఓటర్లకు అవగాహన కోసం జిల్లాలోని వివిధ కళాశాలల విద్యార్థులు, పాఠశాలల నుంచి150 పైన ప్రతులను రాష్ట్ర ఎన్నికల అధికారికి పంపించారు. ఆయా విభాగాల్లో బహుమతులు పొందిన విద్యార్థులకు ట్రైనీ కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. గెలుపొందిన విద్యార్థులను సెంట్రల్ ఎలక్షన్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనడానికి పంపించినట్లు తెలిపారు.

వెంకటయ్యకు శుభాకాంక్షలు



బక్కి వెంకటయ్యను కలిసిన నాయకులు

దోమ: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ప్రమాణస్వీకారమహోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం దోమ మండల నాయకులు జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు రమేష్‌బాబు ఆయనను నగరంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన బడుగు బలహీనవర్గాల హక్కుల పరిరక్షణకు సహకరించాలని కోరారు.

మహిళల అభ్యున్నతే లక్ష్యం



మహిళలకు బతుకమ్మ చీరలను అందిస్తున్న నాయకులు

దోమ: మహిళల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని జెడ్పీటీసీ నాగిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల అభ్యున్నతికి బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని రకాల ఆర్థిక సహకారం అందిస్తుందని చెప్పారు. గర్భిణులకు కేసీఆర్ న్యూట్రిషియన్ కిట్లు, ప్రసవం అనంతరం పాపకు అవసరమైన వస్తువులతో కిట్‌ను అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, వైస్ ఎంపీపీ మల్లేశం, ఉప సర్పంచ్ గోపాల్‌గౌడ్, మండల రైతు కమిటీ కోఆర్డినేటర్ లక్ష్మయ్య, కోఆప్షన్ సభ్యులు ఖాజ పాష పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్ ప్రారంభం



ఆధార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

తాండూరు రూరల్: మండల పరిధిలోని చెంగోల్ గ్రామంలో ఆధార్ సెంటర్‌ను గ్రామ సర్పంచ్ మల్లీశ్వరిగౌడ్ ప్రారంభించారు. బీఆర్ఎస్ మండల జనరల్ సెక్రటరీ రాకేష్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ ప్రజలు ఆధార్ కార్డు అప్‌గ్రేడ్‌తో పాటు తప్పు, ఒప్పులను సరి చేసుకోవచ్చని సూచించారు. నెల రోజుల పాటు గ్రామస్తులకు అందుబాటులో సెంటర్ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచు లక్ష్మణ్, నాయకులు వేణుగౌడ్, గ్రామస్తులు ఉన్నారు.

నారాయణపూర్ ప్రజల కల సాకారం

మంత్రి మహేందర్‌రెడ్డి

తాండూరు రూరల్: నారాయణపూర్ గ్రామ ప్రజల చిరకాల స్వప్నం బ్రిడ్జి నిర్మాణంతో నెరవేరిందని మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. సీఆర్ఆర్ నిధులు రూ.11 కోట్లతో నారాయణపూర్-తాండూరులోని కాగ్నా వాగుపై బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావడంతో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డితో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. గోనూర్, వీరశెట్టిపల్లి గ్రామాలకు కూడా బిడ్జి నిర్మాణం పూర్తయినట్లు మంత్రి తెలిపారు. పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్, ఎంపీటీసీ నర్సమ్మ, సీనియర్ నాయకులు పురుషోత్తంరావు, నాయకులు హమీద్, నర్సింలు ,శ్రీనివాస్ ఉన్నారు.

దోచుకున్నదంతా కక్కిస్తాం

- బీఆర్ఎస్‌ను చిత్తుగా ఓడించాలి
- మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్‌కుమార్

బంట్వారం: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కల్వకుంట్ల కుటుంబం దోచుకున్నదంతా కక్కిస్తామని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హాత్ సే హాత్ జోడోయాత్రలో భాగంగా బుధవారం ఆయన కోట్‌పల్లి పరిధిలోని రాంపూర్‌లో ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ గ్యారంటీ స్కీంలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. తాము అధికారంలోకి రాగానే మేనిఫెస్టోతో పాటు గ్యారంటీ పథకాలను తూచ తప్పకుండా అమలు చేస్తామన్నారు. కేసీఆర్ మాయమాటలకు మరోసారి నమ్మి మోసపోవద్దని సూచించారు. నాటి వైఎస్ఆర్ సంక్షేమ పాలనను ఆయన గుర్తు చేశారు. తన హయాంలో రూ.వెయ్యి కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని చెప్పారు. తాను వేసిన రోడ్లపై స్థానిక ఎమ్మెల్యే తట్టెడు మట్టి కూడా వేయించని దుస్థితిలో ఉన్నాడని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింగ్‌నాయక్ , మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అయూబ్ అన్సారీ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాహిద్ , వికారాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాంచంద్రారెడ్డి ,కౌన్సిలర్లు సుధాకర్‌రెడ్డి , మురళి, మాజీ జెడ్పీటీసీ అంజయ్య, బార్వాద్ ఎంపీటీసీ నర్సింహరెడ్డి,నాయకులు జ్ఞానేశ్వర్, మహేశ్వర్‌రెడ్డి ,ప్రభాకర్‌రెడ్డి ,మాధవ్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శులు నర్సింహారెడ్డి ,హరీశ్వర్‌రెడ్డి ,సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సభను జయప్రదం చేయండి

బీఆర్ఎస్ నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి

మర్పల్లి: నేడు వికారాబాద్ పట్టణంలో నిర్వహించనున్న కేటీఆర్ బహిరంగ సభను జయప్రదం చేయాలని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు నాద్రీగ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండల పరిధిలోని 27 గ్రామ పంచాయతీలు, మరో 8 అనుబంధ గ్రామాల నుంచి సుమారు 7 వేల మంది బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను కేటీఆర్ సభకు తరలించేలా అన్ని ఏర్పాటు చేశామన్నారు. పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ మధుకర్, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రమేష్ మిత్ర, అశోక్, ప్రధాన కార్యదర్శి రాచన్న, సహకార సంఘం డైరెక్టర్ యాదయ్య, యూత్ ప్రెసిడెంట్ మధుకర్, మర్పల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు గఫార్, సహకార సంఘం డైరెక్టర్ గౌస్ తదితరులు ఉన్నారు.

అనువైన స్థలం కేటాయించండి

అనంతగిరి: ప్రభుత్వం ఎస్టీ బాలికల వసతి గృహానికి కేటాయించిన స్థలం పట్టణానికి చాలా దూరంగా ఉంది. దీంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతుందని అఖిల భారతీయ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాఘవన్ నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం వసతి గృహం నిర్మాణానికి బంజారా భవనం వెనకాల ఉన్న స్థలాన్ని కేటాయించారని అన్నారు. హాస్టల్‌కు పట్టణానికి మధ్య కనీసం 6 కి.మీల దూరం ఉంటుందని చెప్పారు. వికారాబాద్ పట్టణం మెయిన్ ఏరియాలో 10 గుంటల స్థలం కేటాయించి నిర్మిస్తే బాగుంటుందని సూచించారు. ఈ విషయంలో ఎమ్మెల్యే, కలెక్టర్ తగిన చొరవ చూపి స్థలాన్ని మార్పు చేయాలని కోరారు.

పేదల పెన్నిధి ఇంద్రారెడ్డి



ఇంద్రారెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

తాండూరు రూరల్: పేదల కోసం నిరంతరం కృషి చేసిన వ్యక్తి మాజీ హోంమంత్రి స్వర్గీయ ఇంద్రారెడ్డి అని నాయకులు కొనియాడారు. బుధవారం కోటబాసుపల్లి గ్రామంలో ఇంద్రారెడ్డి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ నాపరాతి గనులను పేద కార్మికులకు అందజేసిన ఘనత ఇంద్రారెడ్డికే దక్కిందని తెలిపారు. కార్యక్రమంలో రాజశేఖర్‌రెడ్డి, రాందాస్ ,నాగప్ప ,బురానోద్దిన్,యునిస్, శేఖర్‌గౌడ్, గౌస్, రవి, నర్సిములు, సాయప్ప,చంద్రప్ప, రాములు ఉన్నారు.

ఏ బ్లాక్ జనరల్ సెక్రటరీగా మినాజ్



నియామక పత్రం అందుకుంటున్న మినాజ్

పెద్దేముల్: తాండూరు నియోజకవర్గ ఏ బ్లాక్ జనరల్ సెక్రటరీగా పెద్దేముల్ గ్రామానికి చెందిన మినాజ్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. బుధవారం తాండూరు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏ బ్లాక్ అధ్యక్షుడు లోంక నర్సిములు, తాండూరు పట్టణ అధ్యక్షుడు అబీబ్‌లాల నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లోంక నర్సిములు మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. మాయమాటలతో మోసం చేస్తున్న బీఆర్ఎస్‌ను ఇంటికి సాగనంపాల్సిన సమయం దగ్గర పడిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పెద్దేముల్ మండల పార్టీ అధ్యక్షుడు గోపాల్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్‌కుమార్, సీనియర్ నాయకుడు (న్యాయవాది) ఎల్లారెడ్డి, మండల వివిధ గ్రామాల నాయకులు బంద్యప్ప, కోళ్ల గోపాల్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

నిరసనల హోరు.. నినాదాల జోరు



పరిగి: సమ్మెకు మద్దతు తెలుపుతున్న సీపీఎం నాయకులు



అనంతగిరి: సమ్మె చేస్తున్న 104 సిబ్బంది



కుల్కచర్ల: నిరసన వ్యక్తం చేస్తున్న తపాలశాఖ సిబ్బంది

- ఆశవర్కర్ల సమస్యలను పరిష్కరించండి
- సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య

పరిగి: కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తానని చెప్పిన హామీని అమలు చేయడంలో సీఎం కేసీఆర్ విఫలమయ్యారని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య విమర్శించారు. బుధవారం పట్టణ కేంద్రంలో నిరసన వ్యక్తం చేస్తున్న ఆశ వర్కర్లకు ఆయన మద్దతు తెలిపారు. అనంతరం వెంకటయ్య మాట్లాడుతూ.. ఆశవర్కర్ల విలువ కరోనా సమయంలో ప్రజలందరికీ తెలిసిందన్నారు. వారి సేవలను ప్రభుత్వాలే ప్రశంసించాయి. అయినా, సీఎం వారి సమస్యలను పరిష్కరిండంలో ఎందుకు శ్రద్ధ చూపడం లేదో అర్థం కావడం లేదన్నారు. వెంటనే వారికి కనీస వేతనం రూ.18వేలు ప్రకటించి, ప్రభుత్వ ఉద్యోగులకు అందిస్తున్న అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలని కోరారు. లేని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సత్తయ్య, రఘురాం, శేఖర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

అనంతగిరి: 104 ఉద్యోగులను వెంటనే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ మహిపాల్ పేర్కొన్నారు. బుధవారం వికారాబాద్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట 104 ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మె రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి చాలీచాలని వేతనాలతో సతమతమవుతున్నామని వాపోయారు. సీఎం కేసీఆర్ సానుకూల నిర్ణయం తీసుకొని తమకు న్యాయం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో 104 జిల్లా అధ్యక్షుడు తుకారం, కార్యదర్శి మహేందర్ నాయకులు మహేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్, గోవర్ధన్, వినోద, బాలరాజు రాజేశ్వర్, నవీన్, ఇస్మాయిల్, రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

తపాలశాఖ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆందోళన

కుల్కచర్ల: తమ సమస్యలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకుని న్యాయం చేయాలని తపాలశాఖ(పోస్టాఫీస్) ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఒక రోజు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. బుధవారం మండల కేంద్రంలోని తపాలశాఖ కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, 8గంటల పని సమయాన్ని నిర్దేశించి, నిబంధనలను సడలించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం స్పందించని పక్షంలో డిసెంబర్ 5వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉద్యోగులు వేణు, అంజన్‌గౌడ్, బుచ్చిలింగం, బాలరాజ్‌గౌడ్, హన్మంతు, దామోదర్, శివకుమార్ పాల్గొన్నారు.

శిక్షణ తరగతులతో లబ్ధి

ఎంపీపీ అరవింద్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

పరిగి: భవన నిర్మాణ కార్మికులు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ అరవింద్ రావు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జన్‌సాహస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులకు శిక్షణ తరగతులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 15 రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇస్తూ రోజువారీగా రూ.300 అందిస్తున్నామని అన్నారు. కావున ప్రతి ఒక్క కార్మికుడు శిక్షణకు హాజరు కావాలన్నారు. శిక్షణ తీసుకోవడంతో పనిలో నైపుణ్యం పెరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శేషగిరిశర్మ, ఎంపీఓ దయానంద్, జన్ సాహస్ స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ప్రకాశ్ ట్రైనర్స్ రాజయ్య పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం పట్టని బీఆర్ఎస్

పీసీసీ ప్రధాన కార్యదర్శి శంకర్

నందిగామ: ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోని బీఆర్ఎస్ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. నందిగామలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింహయాదవ్ అధ్యక్షతన బుధవారం పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోత్కులగూడ గ్రామానికి చెందిన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు కుమార్‌గౌడ్, చంద్రపాల్ రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీజకు సన్మానం

షాద్‌నగర్ రూరల్: ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ విభాగంలో షాద్‌నగర్‌కు చెందిన శ్రీజ ఆల్ ఇండియా నాలుగో ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా బుధవారం వీర్లపల్లి శంకర్, శ్రీజను అభినందించి సన్మానించారు. ప్రాథమిక విద్య నుంచి అత్యుత్తమ ప్రతిభను కనబరుస్తూ విద్యలో రాణించడం అభినందనీయమన్నారు.